క్లుప్తంగా

సన్మానం



ఖానాపురం : మండలంలో ధర్మరావుపేటకు చెందిన వల్లె శ్రీనివాస్ యాదవ్ ఇటీవల కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన నేపథ్యంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు జలేంద్ర చారి, రాజేందర్‌గౌడ్, అశోక్, ప్రభాకర్, విష్ణు మూర్తి, సంజీవ, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంకు..



సంగెం : ఏపీఎం కిషన్ ములుగు జిల్లాకు బదిలీ అయన్ను సెర్ప్ ఉద్యోగులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ఎంపీడీఓ కాసర్ల రవీందర్ మాట్లాడారు. ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహిస్తేనే గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కొమురయ్య, శాంతి మండల సమాఖ్య అధ్యక్షురాలు ఉమాదేవి, కార్యదర్శి రాధిక, కోశాధికారి రమ్యశ్రీ, బ్యాంకు మేనేజర్లు చందు, అనిల్, వెంకన్న, నాయకులు మాధవరెడ్డి, కళావతి, నర్సింహా నాయక్, రమేశ్, మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

అవార్డుకు ఎంపిక

నర్సంపేట : చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కుండె చైతన్య మహాత్మ జ్యోతిరావు పూలే నేషనల్ అవార్డుకు ఎంపికైనట్టు స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఫౌండర్ చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైతన్య మహబూబాబాద్ జిల్లా పరిధిలోని ఇనుగుర్తి మండలం లక్ష్మీపురంలోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా, ఐదో తరగతి విద్యార్థులకు గురుకులాల్లో సీట్లు వచ్చేలా చైతన్య చేసిన కృషితోపాటు ఆమె అందిస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా అవార్డుకు ఎంపిక చేసినట్టు వివరించారు. ఆగస్టు 30న హైదరాబాద్‌లో జరగనున్న కార్యక్రమంలో చైతన్యకు అవార్డు ప్రదానం చేయనున్నట్టు పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

దుగ్గొండి : మండల కేంద్ర శివారులో ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల రిజిస్ట్రేషన్, నంబర్ ప్లేట్, వాహనదారుల లైసెన్స్, తదితరాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. హెల్మెట్ ధరించని పలువురికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. వాహనదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని, తదితర సూచనలు చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

రెండు షాపుల్లో చోరీ



నెక్కొండ : మండల కేంద్రంలోని ఆర్టీసీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని రెండు షాపుల్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు మంగళవారం విచారణ చేపట్టారు. పోలీసు జాగీలాలతో ఎస్సై మహేందర్ చోరీ జరిగిన దుకాణాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఎస్సై మాట్లాడారు. కాంప్లెక్స్‌లోని జమున జూయలరీ వర్క్స్‌లో, పక్కనే మరో చిన్న షాపుల్లో సోమవారం రాత్రి దొంగలు సుమారు 34 తులాల వెండి వస్తువులు అపహరించినట్టు తెలిపారు. సదరు షాపుల యాజమానులు పద్మ, గోపీ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. త్వరలో దొంగలను పట్టుకొని చోరీకి గురైన సొత్తును రికవరీ చేస్తామన్నారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని తోపనగడ్డతండాలో గతేడాది జరిగిన దొంతనం కేసులో నిందితుడిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్సై రాజేశ్‌రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన బాల ధనిరామ్ భానోతు గతేడాది తోపనగడ్డతండాకు చెందిన బాదావత్ సునీత ఇంట్లో రెండు జతల బంగారు కమ్మలు, 20 గ్రాముల వెండి పట్టీలు చోరీ చేశారు. మండలంలోని జల్లిలోని క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ధనిరామ్ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా అదుపులోకి తీసుకుని విచారించారు. తోపనగడ్డతండాలో దొంగతనం చేసినట్లు అంగీకరించారు. ధనిరామ్‌ను రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

సమస్యల వలయంలో ఆస్పత్రి భవనం

- డ్రెయినేజీ సరిగా లేక కంపుమయం
- లీకేజీలతో తాగునీటి కష్టాలు
- స్లాబ్ పెచ్చులూడి పడుతున్న దుస్థితి



నర్సంపేట ఆస్పత్రి పాత భవనం



నేలపై పడిన స్లాబ్ పెచ్చులు (ఫైల్)

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పాత భవనం సమస్యల వలయంలో చిక్కుకున్నట్టు కనపడుతోంది. నూతన భవనం నిర్మించినా సిబ్బంది కొరత, ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు, సర్జరీ పరికరాలు పూర్తిస్థాయిలో రాకపోవడంతో ఐపీ (ఇన్‌పేషెంట్) వ్యవస్థ పాత భవనంలోనే కొనసాగుతోంది. నాణ్యతా లోపంతో స్లాబ్ పెచ్చులూడి పడుతున్న దుస్థితి నెలకొంది. అండర్ డ్రెయినేజీ సరిగా లేకపోవడంతో మురుగు బయటకు వచ్చి కంపుమయం అవుతోంది. ఇక మిషన్ భగీరథ పైపులైన్లు తరచూ లీకేజీలకు గురవుతుండడంతో రోగులు, వైద్యసిబ్బంది, రోగులతో వచ్చిన బంధువులకు నీటి కష్టాలూ తప్పడం లేదు.

పట్టణంలో 1999లో నాటి ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు 50 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. భవనం నిర్మించి సుమారు 25 ఏళ్లు గడుస్తోంది. కాగా దఫాల వారీగా పలుమార్లు భవనాన్ని అభివృద్ధి చేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. జిల్లా ఆస్పత్రిగా, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కళాశాలగానూ అప్‌గ్రేడ్ అయ్యింది. జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్‌చేయడంతోనే గత ప్రభుత్వం మూడు బ్లాక్ నిర్మాణానికి నర్సంపేట సర్వాపురం శివారులోని సుమారు 20 ఎకరాల స్థలంలో ప్రభుత్వ నిధులతో మూడు బ్లాక్‌లు నిర్మించారు. జిల్లా ఆస్పత్రి నుంచి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కళాశాలను మంజూరు చేయడంతో అందులో ఒక బ్లాక్‌ను మెడికల్ కళాశాలకు కేటాయించగా మరో బ్లాక్‌లో ఔట్ పేషెంట్స్ (ఓపీ) నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 'ఎ' బ్లాక్‌లో ఐపీ (ఇన్‌పెషెంట్స్) కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ఆక్సిజన్ ప్లాంట్, సర్జరీ పరికరాలు, నర్సింగ్, శానిటేషన్ స్టాఫ్ లేకపోవడంతో కొత్త ఆస్పత్రిలో ఐపీ సేవలు ఇంకా ప్రారంభించలేదు. దీంతో ఆస్పత్రి పాత భవనంలోనే ఐపీ సేవలు కొనసాగుతున్నాయి. ప్రతీరోజు సుమారు 70–80 మంది రోగులు ఓపీకి వస్తున్నారు.

శిథిలావస్థలో ఆస్పత్రి పాత భవనం

ప్రభుత్వ ఆస్పత్రి భవనాన్ని సుమారు 25 ఏళ్ల క్రితం నిర్మించారు. భవనంలోని పలు చోట్ల స్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. ఆస్పత్రి నిత్యం రోగులతో కిటకిటలాడుతోంది. తాజాగా ఈనెల 26న పిల్లల వార్డు సమీపంలోని వరండాలో స్లాబ్ పెచ్చలూడి పడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. రోగులకు, వైద్యసిబ్బందికి, అటెండెంట్లకు నిత్యం నడిచే ప్రదేశంలోనే పెచ్చులూడి పడడంతో భయాందోళన నెలకొంది. ఆస్పత్రి భవనం పార్కింగ్ స్థలం వద్ద చెట్ల వేర్లు సైడ్ డ్రైనేజీని ధ్వంసం చేయడంతో ఆస్పత్రి మురుగు నీరంతా బయటకు వచ్చి దుర్గంధం వ్యాపిస్తోంది. ఆస్పత్రికి వస్తున్న రోగులు, అటెండెంట్లు, వైద్యసిబ్బంది ముక్కు మూసుకుంటున్న దుస్థితి నెలకొంది. ఆస్పత్రిలో రెండు బోర్లున్నా అవి కనీసం ఐదు నిమిషాల పాటు కూడా నీళ్లు అందించలేకపోతున్నాయి. ఆస్పత్రికి మిషన్ భగీరథ నీళ్లు దిక్కు కాగా పైపులైన్లకు లీకేజీలు ఏర్పడుతూ రెండ్రోజులకోసారి నీటి కష్టాలు ఎదురవుతున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు మెండుగా ఉన్న క్రమంలో ఐపీ విభాగాన్ని నూతన ఆస్పత్రి భవనానికి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

స్టాఫ్ వచ్చాక ఐపీని మారుస్తాం



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నర్సింగ్ స్టాఫ్ కొరత ఉంది. ఉన్నతాధికారులకు నివేదికలు అందించాము. త్వరలో నర్సింగ్ స్టాఫ్‌ను పంపిస్తారు. నర్సింగ్ స్టాఫ్ రాగానే ఐపీ విభాగాన్ని ఆస్పత్రి నూతన భవనంలోకి మార్చుతాం. మిషన్ భగీరద నీళ్లు అందరి సమయాల్లో మున్సిపల్ అధికారుల సహకారంతో ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా అవసరమైన మేరకు నీటిని తెప్పిస్తున్నాం. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా సేవలందించే ఏర్పాట్లు చేస్తున్నాం.

– డాక్టర్ కిషన్, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్

నర్సంపేట : చెన్నారావుపేటలో నాగదేవతకు పూజ చేస్తున్న భక్తులు



భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి



నర్సంపేట : పుట్టలో పాలు పోస్తున్న మహిళలు



ఖానాపురం : సీతారామచంద్రస్వామి గుడిలో..



సంగెం : సంఘమేశ్వరాలయంలో..

సాక్షి నెట్‌వర్క్ : నర్సంపేట, చెన్నారావుపేట, ఖానాపురం, సంగెం, గీసుకొండ మండలాల్లో మహిళలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి నిర్వహించారు. గీసుకొండ మండలం ఊకల్ నాగేంద్ర స్వామి ఆలయంలో స్వామి వారిని ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు లక్ష తమలపాకులు, పుష్పాలతో అలంకరించారు. మహిళలు పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించారు.

అయ్యప్పస్వామికి అభిషేకాలు



పూజ చేస్తున్న అర్చకులు, భక్తులు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్‌గుప్తా, అధ్యక్షుడు సైఫా సురేశ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహానికి మంగళవారం అభిషేక పూజలు నిర్వహించారు. పట్టణానికి చెందిన బాదం శ్రావణి రంజిత్‌కుమార్, శింగిరికొండ స్వరాజ్యలక్ష్మి ఉపేందర్ దంపతులతోపాటు రేపల రోహిత్‌కుమార్ తల్లి రజిత, పాల్గొనగా అభిషేక పూజలు చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ మాధవశంకర్ మాట్లాడుతూ దాతలు ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు దొడ్డ రవీందర్, చింతల కమలాకర్ రెడ్డి, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, ఇరుకుల్ల వీరలింగం, దామోదర్, డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, శింగిరికొండ ఉపేందర్, షానగంటి కరుణాకర్, భూపతి లక్ష్మీనారాయణ, శింగిరికొండ వేణుగోపాల్, సురేశ్, బందారుపల్లి చెంచారావు, శ్రీరాముల శంకరయ్య, దొడ్డ వేణు, మల్యాల రాజు, పాలకుర్తి శ్రీనివాస్, వజినపల్లి శ్రీనివాస్, అనంతుల రాము, సుదర్శన్, కొత్తిమీర కరుణాకర్, అర్చకుడు దేవేశ్ మిశ్రా, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు



పర్వతగిరి : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏబీ స్విచ్ ఆన్ ఆఫ్‌కు సంబంధించి 25 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన లింబ్ చెడిపోవడంతో సిబ్బంది దాన్ని మార్చేందుకు మంగళవారం మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఏడీఈ తిరుపతి మాట్లాడారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా నిలిపేసి మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు.

పద్మశాలి సంఘం పట్టణ కమిటీ ఎన్నిక



నర్సంపేట : అఖిల భారత పద్మశాలి సంఘం పట్టణ కమిటీని జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్, మాజీ మార్పోరేటర్ సంగెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాజుల సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా బాల్నె జగన్, మండల కమిటీ ఇన్‌చార్జ్‌లుగా గుళ్లపల్లి సుధాకర్, బలభద్ర రవీందర్, దిడ్డి గణేశ్, రాంపెల్లి లింగమూర్తి, బూర చందర్‌రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గాజుల సాంబయ్య మాట్లాడారు. పదవులకు న్యాయం చేకూరుస్తామన్నారు. సభ్యత్వం నమోదు చేయించుకున్న వారికి రూ.10 లక్షల బీమా కల్పిస్తామని, ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బాసాని సుదర్శన్, కూచన లింగయ్య, తుమ్మ ఏకాంబరం, పెండెం భాస్కర్, ఆడెపు చంద్రశేఖర్, ఆడెపు రాజయ్య, కొండ్లె క్రాంతికుమార్, సమ్మయ్య, బంక పరమేశ్, సామల సత్యం, కొబ్బరికాయల సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి



సమావేశంలో మాట్లాడుతున్న మేకల రవి

గీసుకొండ : ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి కోరారు. మండలంలోని ధర్మారంలో మహ్మద్ పాషా, భారతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి రవి అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ నిత్యం పేద, మధ్య తరగతి ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న తప్పుడు విధానాలపై ఉద్యమించేలా ప్రజలను చైతన్యవంతం చేస్తున్నట్టు చెప్పారు. మహాసభలకు నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి బాధ్యులు పంజాల రమేశ్, జిల్లా సహాయ కార్యదర్శి బాషు మియా, ప్రసన్న ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేశ్, దండు లక్ష్మణ్, గుండె భద్రి, చంద్రకళ, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మండల మహాసభ

వర్ధన్నపేట : పట్టణంలో సీపీఐ 15వ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి హాజరై మాట్లాడారు. పోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. అనంతరం మండల కార్యదర్శిగా మునిగాల వేణును, సహాయ కార్యదర్శిగా కడమంచి యాదగిరిని ఎన్నికయ్యారు. సభలో రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్, జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, బాషుమియా, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేశ్, ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెల్లి రవి, తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి దామెర కృష్ణ, జిల్లా సమితి సభ్యులు సుప్రియ, వంశిత, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

వర్ధన్నపేట : తొర్రూరు మండలంలోని వెలికట్ట గ్రామంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎర్రం దమాషానీ ఐలయ్య (65) మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం నివాళులర్పించారు. అనంతరం ఐలయ్య సమీప బంధువైన బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎర్రం రాజుతో ప్రమాదంపై దయాకర్‌రావు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబాన్ని దయాకర్‌రావు పరామర్శించారు.

స్తూపావిష్కరణ

వర్ధన్నపేట : సీపీఐ పట్టణ నాయకుడు ఎలమకంటి శ్రీనివాస్ చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి, ఇతర నాయకులు నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి ఆరెల్లి రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీనివాస్ స్మారక స్తూపాన్ని మేకల రవి నాయకులతో కలిసి మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. శ్రీనివాస్ నిత్యం ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్మించారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్, జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్, బాషుమియా, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేశ్, ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెల్లి రవి, తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి దామెర కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అధ్యయనాన్ని అలవర్చాలి

దుగ్గొండి : విద్యార్థులకు అధ్యయనాన్ని అలవర్చాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన నాచినపల్లి, మల్లంపల్లి స్కూల్ కాంప్లెక్స్‌ల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పాఠశాలల్లోని లైబ్రరీల్లోని పుస్తకాలను విద్యార్థులు అధ్యయనం చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థుల ప్రగతి రికార్డులను సిద్ధం చేయాలని చెప్పారు. సమావేశంలో హెచ్‌ఎంలు ఎలగొండ రామస్వామి, జూలూరి జ్యోతిలక్ష్మి, భద్రమ్మ టీచర్లు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ అందజేత

వర్ధన్నపేట : పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులకు తాగునీటి అవసరాలు తీర్చేలా స్థానికులు చెన్న ప్రవీణ్‌కుమార్, బొజ్జ సురేందర్, నోముల శ్రీనివాసులు మంగళవారం వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన సింటెక్స్ వాటర్ ట్యాంకును అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజకుమారి, రహీం, తాళ్లపల్లి శ్రీనివాస్, గుడికందుల సురేశ్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నర్సంపేట : గోవాలో ఆగస్టు 7న తలపెట్టిన అఖిల భారత జాతీయ ఓబీసీ పదో మహాసభ వాల్‌పోస్టర్లను పట్టణంలోని కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యాంకుమార్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శులు చెన్నూరి రవి, బొనగాని రవీందర్, మండల ఉపాధ్యక్షుడు భేతి విశ్వబంధు, తదితరులు పాల్గొన్నారు.


ముగ్గురికి గాయాలు

నల్లబెల్లి : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన ఘటన మండలంలోని శనిగరం శివారులో రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. నర్సంపేట మండలంలోని దాసరిపల్లికి చెందిన ప్రవీణ్, అతడి తల్లి ఈశ్వర బైక్‌పై వస్తుండగా బైక్ అదుపుతప్పి రోడ్డుపై నడుస్తున్న పెరుమాండ్ల సాంబయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాంబయ్యతోపాటు ఈశ్వర, ప్రవీణ్ గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల..

ఖానాపురం : మండలంలోని కొత్తూరు, రంగాపురం గ్రామాల కాంగ్రెస్ పార్టీ కమిటీలను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు హరిబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. కొత్తూరు కమిటీకి అధ్యక్షుడిగా సంపత్‌కుమార్, ఉపాధ్యక్షుడుగా అజ్మీర రాజు, ప్రధాన కార్యదర్శిగా నాంచారి కుమారస్వామి, సహాయ కార్యదర్శులుగా నరేశ్, మొగిలి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బైరబోయిన సురేశ్, ప్రధాన కార్యదర్శిగా పోతరాజు సాంబరాజుతోపాటు పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకున్నారు. రంగాపురం కమిటీ అధ్యక్షుడిగా పిండి కుమార్, ఉపాధ్యక్షులుగా బాబు, బలరాం, ప్రధాన కార్యదర్శిగా నరేశ్, కోశాధికారిగా చిన్నవీరయ్యతోపాటు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్‌రావు, నర్సింహ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి



వీరస్వామి (ఫైల్)

నర్సంపేట రూరల్ : ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మహేశ్వరంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై అరుణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిదురాల వీరస్వామి (50) వీరస్వామి నర్సంపేటకు చెందిన విజయ్, సృజన్ సహకారంతో గుజ్జ సుజాత వద్ద రూ.4 లక్షలు అప్పు తీసుకుని తన భార్య పేరిట ఉన్న 1.6 ఎకరాల భూమిని తాకట్టు పెట్టారు. కాగా సుజాత వీరస్వామి తాకట్టు పెట్టిన భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకోగా వీరస్వామి బాకీ ఉన్న డబ్బు తీసుకెళ్లి ఇవ్వడానికి ప్రయత్నించగా భూమి అమ్మేసినట్టు తెలిపారు. భూమి తనకు రిజిస్ట్రేషన్ చేయాలని వీరస్వామి అడగ్గా సుజాత, విజయ్, సృజన్ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన వీరస్వామి ఈనెల 28న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వీరస్వామి సోదరుడు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

దుగ్గొండి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గురుమూర్తి శివకుమార్ కోరారు. మండలంలోని గిర్నిబావిలో పార్టీ మండల అధ్యక్షుడు నేదురు రాజేందర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి శివకుమార్ అతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని బూత్‌ల్లోనూ సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ప్రజలతో మమేకయ్యేలా కార్యక్రమాలు రూపొందించుకోవాలని చెప్పారు. నూతన ఓటర్లను ఆకర్షించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. సమావేశంలో నాయకులు కొండపాక మధు, చిరంజీవి, దూలం రామకృష్ణ, వేణుమాధవ్, లింగన్న, పెండ్యాల తిరుపతి, నరేశ్, నూతన కంటి శ్రీనివాస్, లింగాచారి, విఘ్నేశ్ గౌడ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమాలే శరణ్యం

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేశ్

నర్సంపేట రూరల్ : రైతుల హక్కుల సాధనకు ఉద్యమాలే శరణ్యమని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ అన్నారు. నర్సంపేట మండలంలోని మాదన్నపేటలో ఏఐకేఎఫ్, ఎంసీపీఐ(యూ) సంయుక్త ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శతజయంతి వేడుకల్లో భాగంగా 'రైతాంగ ఉద్యమాలు–ఓంకార్ పాత్ర' అంశంపై ఏఐకేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కౌెట్టి సదానందం అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో రమేశ్ మాట్లాడారు. ఓంకార్ పీడిత ప్రజల విముక్తి కోసం జీవితాన్ని త్యాగం చేశారని చెప్పారు. భూపోరాటాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1.67 లక్షల ఎకరాల భూములను పేదలకు దక్కేలా ఉద్యమించారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు అక్కపెల్లి రమేశ్, ఎంసీపీఐ (యూ) డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, గ్రామ కమిటీ కార్యదర్శి అనుమాల రమేశ్, న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు ఆకుల వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ కార్యదర్శి కొత్తకొండ శ్యామ్, నాయకులు కొండం వీరేంద్రస్వామి, బీఆర్‌ఎస్ నాయకులు కడారి కుమారస్వామి, పెసరు సాంబరాజ్యం, బీఆర్‌పీ నాయకులు బుర్రి సాగర్, తనుగుల శ్రీకాంత్, ఆదివాసీ సంఘం నాయకులు ఆకుల కుమార్, మాజీ సర్పంచ్ మొల్గూరి చంద్రమౌళి, కర్నె సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని గొల్లభామతండా, సూర్యపేటతండాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ధరావత్ బాలు, జాటోత్ మోహన్, తదితరులు బీజేపీలో మండల అధ్యక్షుడు దామెరుప్పుల శేఖర్ ఆధ్వర్యంలో బీజేపీ చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మోసపూరిత హామీలపై విసుగు చెందిన వారికి బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయమని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ దుంకదువ్వ రంజిత్, ఉపాధ్యక్షుడు కందాల చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శులు కీసరి సాంబరాజు, మురహరి విజయ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవం

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటలోని నాయక్‌పోడు కాలనీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బొమ్మెర సతీశ్ ఆధ్వర్యంలో మంగళవారం వన మహోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరి బాధ్యతగా అభివర్ణించారు. మొక్కలను నాటడంతోపాటు సంరక్షించాలని సూచించారు. విద్యార్థులకు ఇష్టమైన పేర్లు మొక్కలకు పెట్టించి వారే కాపాడుకునేలా దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జాటోత్ పద్మ, అమ్మ ఆదర్శ పాఠశాల పూర్వ చైర్మన్ సమ్మయ్య, సీసీహెచ్ వెంకటమ్మ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండలంలోని మరియపురం గ్రామానికి చెందిన తుమ్మ శౌరెడ్డి సోమవారం మృతి చెందగా అంత్యక్రియల కోసం బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ అల్లం బాలిరెడ్డి మంగళవారం రూ.10 వేల సాయం అందజేశారు. తొలుత శౌరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పెంటారెడ్డి, జోజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, నాయకులు నర్సింహారావు, బాలరాజు, రాజబాబు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.